క్లుప్తంగా

నేడు సైన్స్ ఎగ్జిబిషన్

వీరఘట్టం: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్టు ఎంఈఓలు డి.గౌరినాయుడు, ఆర్.ఆనందరావు తెలిపారు. స్థానిక కార్యాలయంలో వీరు విలేకర్లతో గురువారం మాట్లాడారు. ప్రతీ హైస్కూల్ నుంచి 3 ప్రాజెక్టులను ప్రదర్శించాలని సూచించారు. ఇక్కడ ఎంపికైన ప్రాజెక్టులను జిల్లా స్థాయికి పంపించడం జరుగుతుందన్నారు. తద్వారా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయికి కూడా ఈ ప్రాజెక్టులను తమ ప్రదర్శనలతో తీసుకువెళ్లవచ్చునని తెలిపారు. సైన్స్ ఎగ్జిబిషన్‌ను విజయవంతం చేయాలని కోరారు.

17 వరకు ఆడుదాం.. ఆంధ్రా రిజిస్ట్రేషన్లు

సీతంపేట: ఆడుదాం ఆంధ్రా రిజిస్ట్రేషన్లు ఈ నెల 17 వరకు పొడిగించినట్టు ఎంపీడీఓ కె.గీతాంజలి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26 నుంచి క్రీడా పోటీలు ప్రారంభం కానున్నాయన్నారు.

రేపటి నుంచి సమగ్ర శిక్ష సిబ్బంది పెన్‌డౌన్

పాలకొండ రూరల్: తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 16 నుంచి పెన్‌డౌన్ చేపట్టనున్నట్టు సమగ్ర శిక్ష సిబ్బంది గురువారం తెలిపారు. ఈ మేరకు ఇన్‌చార్జి డీవైఈఓ పి.కృష్ణమూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ నెల 20 నుంచి నిరవధిక సమ్మెకు సిద్ధం కానున్నట్టు సమగ్ర శిక్ష మండల జేఏసీ ప్రతినిధులు భాను, సత్యనారాయణ తదితరులు తెలిపారు. ప్రభుత్వం తమకు బకాయిపడిన జీతాలు చెల్లించాలని, అర్హత మేరకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

పరామర్శ



వైఎస్సార్‌సీపీ కార్యకర్తను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

కురుపాం: మండలంలోని మొండెంఖల్ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త బీమవరపు నాగరాజు రెండేళ్లుగా పక్షవాతంతో మంచం పట్టడంతో విషయం తెలుసుకున్న కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి గురువారం స్వయంగా ఆయన వద్దకు వెళ్లి పరామర్శించారు. అన్ని విధాలా ఆదుకుంటానని ప్రభుత్వం ద్వారా ఏమైనా సంక్షేమ పథకాలు అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ గొర్లి సుజాత, స్థానిక ఎంపీటీసీ గుడారి విద్యారాణి, మాజీ ఎంపీపీ ఇందిరా కుమారి, రేవు సత్తిబాబు, బిడ్డిక అనంత్ పాల్గొన్నారు.

పీఎంసీ అమలు పరిశీలన

భామిని: మండలంలోని నల్లరాయిగూడ జీపీఎస్ స్కూల్‌ను ఐటీడీఏ ప్రత్యేక బృందం గురువారం పరిశీలించింది. ప్రాజెక్టు అధికారి కె.కల్పనాకుమారి ఆదేశాల మేరకు ప్రాజెక్టు మోనిటరింగ్ క్యాంపెయిన్ మెథడ్‌లో అమలు చేస్తున్న బోధనాంశాలను జీసీడీఓ జి.రాములమ్మ ఆధ్వర్యంలో ఏఎంఓ కోటిబాబు, ఏఎంఓ చిరంజీవులు బృందం పరిశీలించింది. విద్యా బోధనాంశాలపై హెచ్‌ఎం మోటక రవికుమార్‌తో చర్చించారు.

క్రీడల్లో డ్రైవర్ ప్రసాద్ సత్తా

పాలకొండ రూరల్: స్థానిక ఆర్టీసీ డిపోలో ఉత్తమ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న జె.ప్రసాద్ క్రీడల్లో కూడా తన సత్తా చాటారు. ఇటీవల తిరుపతిలో 45 సంవత్సరాలు దాటిన ప్రభుత్వ ఉద్యోగులకు నిర్వహించిన క్రీడల్లో ప్రసాద్ రాణించారు. 400 మీటర్ల పరుగు పందెంలో, హై జంప్ విభాగంలో బంగారు పతకం సాధించారు. లాంగ్ జంప్‌లో సిల్వర్, వంద మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం దక్కించుకున్నట్టు డీఎం పి.వెంకటేశ్వరావు తెలిపారు. క్రీడల్లో సత్తా కనబర్చి డిపోకు మంచి పేరు తీసుకురావటం పట్ల సహోద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఓ ప్రత్యేక కార్యక్రమం ద్వారా ప్రసాద్‌ను డిపో మేనేజర్ తదితరులు అభినందించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కొమరాడ: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు కొళింగ మల్లేశ్వరరావు అన్నారు. మండలంలోని విక్రాంపురం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఓ పి.శంకరరావు, వ్యవసాయ శాఖ సహాయకురాలు మౌనిక, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

సీతంపేట: స్థానిక మండల భవిత కేంద్రంలో గురువారం ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఎంఈఓ ఎం.ఆనందరావు ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. సీమల శ్వేత నడవలేని స్థితిలో ఉన్న బాలికకు వాకర్ ఇచ్చారు. ప్రత్యేక అవసరాలు గల చిన్నారులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భాస్కరరావు, సహిత ఉపాధ్యాయులు కె.చక్రధర్, వి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పాలకొండ రూరల్: ఓని గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు



కొమరాడ: పరశురాంపురంలో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ డి.జనార్దనరావు తదితరులు

సీఎం జగన్‌తోనే సంక్షేమం - అభివృద్ధి

రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యపడిందని పలువురు ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం పలుచోట్ల గురువారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు ప్రజల వద్దకు వెళ్లి నాలుగున్నరేళ్ల కాలంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరాన్ని తెలియజేశారు. కార్యక్రమాల్లో పలువురు అధికారులు, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



వీరఘట్టం: తెట్టంగిలో వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరిస్తున్న ఎంపీపీ దమలపాటి వెంకటరమణ నాయుడు తదితరులు



సీతంపేట: కిండంగి సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్న ఎంపీపీ ఆదినారాయణ తదితరులు



గుమ్మలక్ష్మీపురం: కేదారిపురంలో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ దీనమయ్య, పార్టీ శ్రేణులు

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి, సంక్షేమం

● ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి



బీటీ రహదారి నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

కురుపాం: వైఎస్సార్‌సీపీతోనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని గుజ్జువాయి పంచాయతీ జి శివడ బీటీ రోడ్డు నుంచి ఎగువ కొత్తగూడ గ్రామానికి జాతీయ ఉపాధి హామీ నిధులు రూ.85 లక్షలతో 1.20 మీటర్ల బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి గురువారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీతోనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా తయారైందన్నారు. గిరిజన గ్రామాల అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. వైఎస్సార్‌సీపీ నాలుగున్నరేళ్ల పాలనలో విద్య, వైద్యంతో పాటు మౌలిక సదుపాయాల కొరత లేకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. అవసరమైన ప్రతీ గిరిజన గ్రామానికి రహదారులు మంజూరు చేసి మెరుగైన సౌకర్యాలు కల్పించటమే తన ముందున్న లక్ష్యమన్నారు. కార్యక్రమంలో గుజ్జువాయి గ్రామ సర్పంచ్ హిమరిక నాగేశ్వరరావు, జి శివడ సర్పంచ్ మిన్నారావు, ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ గొర్లి సుజాత, వైస్ ఎంపీపీ బిడ్డిక అన్నాజీరావు, మొండెంఖల్ ఎంపీటీసీ గుడారి విద్యారాణి, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆనిమి ఇందిరాకుమారి, జిల్లా కో ఆప్షన్ నిషార్, వైఎస్సార్‌సీపీ మన్యం జిల్లా కార్యదర్శి వెంకటరావు, వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు అంధవరపు కోటేశ్వరరావు, ఐటీడీఏ ఇంజినీరింగ్ విభాగం డీఈ సింహాచలం, ఏఈ అప్పారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు గులిపిల్లి రాజారావు, రేవు సత్తిబాబు కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు కళ్లద్దాల పంపిణీ

కురుపాం: రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన పాఠశాల విద్యార్థుల ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా కురుపాం మండలంలో ఉన్న పాఠశాలల విద్యార్థులకు గురువారం కళ్లద్దాలను పంపిణీ చేసినట్టు జిల్లా కంటి వెలుగు సెల్ నేత్ర వైద్య అధికారి నగేష్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ గతంలో మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు నేత్ర తనిఖీలు చేపట్టగా 98 మంది విద్యార్థులకు నేత్ర సమస్యలు ఉండటంతో కళ్లజోళ్లు అవసరమని గుర్తించి ఆరోగ్య కార్యకర్తల ద్వారా పంపిణీ చేసినట్టు తెలిపారు. అలాగే నేత్రదానం, నేత్ర సమస్యలు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించినట్టు తెలిపారు.

గుమ్మలక్ష్మీపురంలో..

గుమ్మలక్ష్మీపురం: దృష్టి లోపం ఉన్న విద్యార్థులకు కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్నట్టు జిల్లా కంటి వెలుగు సెల్ నేత్ర వైద్యాధికారి జె.నగేష్‌రెడ్డి తెలిపారు. మండలంలోని రేగిడి గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల (బాలికలు)కు చెందిన పలువురు విద్యార్థులకు గురువారం ఆయన కళ్లజోళ్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన పాఠశాల విద్యార్థుల ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా గుమ్మలక్ష్మీపురం మండలంలోని పాఠశాలల విద్యార్థులకు గతంలో నిర్వహించిన నేత్ర పరీక్షల్లో దృష్టి లోపం ఉన్న 98 మంది విద్యార్థులను గుర్తించడం జరిగిందని వారికి కళ్లజోళ్లను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నేత్ర వైద్య సహాయకులు చామంతి, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



కురుపాం జెడ్పీహెచ్ స్కూల్ విద్యార్థులకు కళ్లజోళ్లను పంపిణీ చేస్తున్న ఆరోగ్య కార్యకర్తలు

దివ్యాంగులకు భవిత కేంద్రాలు ఓ వరం

కురుపాం: ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు భవిత కేంద్రాలు ఒక వరంలా ఉపయోగపడుతున్నాయని ఎంఈఓ ఎస్.సత్యనారాయణ అన్నారు. గురువారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా స్థానిక భవిత కేంద్రంలో చిన్నారులకు ఆటల పోటీలను నిర్వహించి బహుమతుల అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల గల చిన్నారుల తల్లిదండ్రులు తమ చిన్నారుల భవిష్యత్ కోసం భవిత కేంద్రాలను తప్పనిసరిగా సద్వినియోగం చేసుకొనేలా చూడా లన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో సరుకుల మాయం

భామిని: అంగన్‌వాడీ కేంద్రాల్లో నిల్వ ఉండాల్సిన సరుకులు మాయమైనట్టు ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరి గురువారం తెలిపారు. మండలంలోని బత్తిలి, నేరడి బీ, గురండి, లోహరిజోల, నులకజోడు కేంద్రాలను కార్యదర్శి అనసూయతో కలిసి గురువారం సందర్శించారు. గర్భిణులు, పిల్లలకు పౌష్టికాహారం అందించే ఏర్పాట్లు చేశారు. వెలుగు వీఓఏలు, ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులు, వలంటీర్ల సహకారంతో పౌష్టికాహారం అందించే ప్రయత్నాలకు కేంద్రాల్లో సరుకులు లేకపోవడంపై ఎంపీడీఓ మండిపడ్డారు. మూడు రోజులుగా సమ్మె పేరిట విధులకు హాజరుకాని కార్యకర్తలు, సహాయకులు కేంద్రాలను అప్పగించి పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. సమ్మెలో ఉండే వారు సరుకులు అప్పగించాల్సి ఉందన్నారు. కేంద్రాల్లో సరుకుల మాయంపై కలెక్టర్, ఐసీడీఎస్ పీడీలకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

పాలకొండ రూరల్: ఖరీఫ్ ధాన్యం అమ్మకాలు చేపట్టే రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని వ్యవసాయ శాఖ ఏఓ ఎన్ని వాహిని అన్నారు. మండలంలోని లుంబూరు గ్రామసచివాలయ పరిధిలో పంటకోత ప్రయోగాలను గురువారం పరిశీలించారు. దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయన్నారు. ఇటీవల చోటుచేసుకున్న తుపాను ప్రభావం తగ్గుముఖం పట్టిందన్నారు. ఈ తరుణంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది ప్రభుత్వం రైతులకు మరింత అండగా నిలవనుందన్నారు. ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోళ్లకు సర్వం సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. ఆర్‌బీకేల వద్ద ప్రభుత్వం అందించనున్న రాయితీలు, ధాన్యం సేకరణ సమయంలో అనుసరించాల్సిన విధివిధానాలు, మద్దతు ధర వంటి అంశాలతోకూడిన పోస్టర్లు ప్రదర్శిస్తామన్నారు. అన్నదాతలు ప్రభుత్వ సేవలు అందిపుచ్చుకోవాలన్నారు. ఆమె వెంట వ్యవసాయ సహాయకులు అమిత్‌పాడి తదితరులున్నారు.



లుంబూరులో పంటకోత ప్రయోగాలను పర్యవేక్షిస్తున్న ఏఓ, పలు శాఖల అధికారులు

ఆర్థికాభివృద్ధి సాధించాలి

గుమ్మలక్ష్మీపురం: జీవనోపాధి మెరుగుపర్చుకునేందుకు కొనుగోలు చేసుకొన్న ఆటోను సక్రమంగా వినియోగించుకొని ఆర్థికాభివృద్ధి చెందాలని ఎంపీపీ కుంబురుక దీనమయ్య అన్నారు. మండలంలోని దుమ్మంగి పంచాయతీ కోసంగిభద్ర గ్రామానికి చెందిన ఇందిరమ్మ మహిళా సంఘ సభ్యురాలు పత్తిక పైడమ్మకు మహిళా శక్తి/ఉన్నతి పథకం ద్వారా ఆటో కొనుక్కునేందుకు రూ.3.35లక్షలు రుణంగా మంజూరైంది. మంజూరైన రుణంతో కొనుగోలు చేసిన ఆటోను ఎంపీపీ దీనమయ్య గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో దుమ్మంగి సర్పంచ్ క్రాంతికుమార్, ఎంపీటీసీ కె.మల్లేశ్వరరావు, వైకేపీ సీసీలు పైడా నాగేశ్వరరావు, ఎస్.సి గోపాల్, గ్రామ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



ఆటోను లబ్ధిదారురాలికి అందజేస్తున్న ఎంపీపీ దీనమయ్య

కేంద్రాలు తెరచి పౌష్టికాహారం అందించాలి

పాలకొండ: అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె చేస్తున్న నేపథ్యంలో కేంద్రాలను తెరచి గర్భిణులు, బాలింతలకు ఎటువంటి సమస్య లేకుండా పౌష్టికాహారం పంపిణీ చేయాలని, ఇందుకు తగిన చర్యలు తీసుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు సూచించారు. పట్టణంలోని సచివాలయాల సిబ్బందితో ఆయన గురువారం సమావేశం నిర్వహించిన ఆయ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. కేంద్రాలు యదావిధిగా తెరచి ఆహారం అందించాలన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఐ

పాలకొండ: పాలకొండ స్టేషన్ ఎస్‌ఐగా ఎన్.ప్రశాంత్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఎస్‌ఐ శివప్రసాద్‌కు ఎలివ్వన్‌పేటకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో బలిజిపేట నుంచి ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ మేరకు గురువారం ఆయన బాధ్యతలు చేపట్టారు.



బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఐ



శ్రీకాకుళం జిల్లా పర్యటనకు గురువారం వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కంచిలి మండలం మకరాంపురం హెలిప్యాడ్ వద్ద మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యేలు విశ్వాసరాయి కళావతి, కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

కురుపాం: మండలంలోని గొటివాడ పంచాయతీ నేరేడువలస గ్రామంలో యస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్ ఆధ్వర్యంలో కురుపాం తహసీల్దార్ ఆర్.రమేష్‌కుమార్ పేదలకు గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఆదివాసీ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలనకు ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు కూడా మరిన్ని సేవలు అందించాలని కోరారు. మాజీ ఎంపీటీసీ చంద్రయ్య, యువజన సంఘం నాయకులు బిడ్డిక బుల్లయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్యాలండర్ ఆవిష్కరణ



క్యాలండర్‌ను ఆవిష్కరిస్తున్న ట్రస్టు సభ్యులు

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి, కోదండరామస్వామి ఆలయంలో దేవాలయ అభివృద్ధి సేవా ట్రస్టు సభ్యులు గురువారం క్యాలండర్‌ను ఆవిష్కరించారు. తోటపల్లి ఆలయ చరిత్రను తెలియజేస్తూ 2024 సంవత్సరం క్యాలండర్‌ను సుందరంగా రూపొందించారు. క్యాలండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఈఓ వి.సూర్యనారాయణ, సభ్యులు డి.పారినాయుడు, డి.ధనుంజయరావు, టి.దుర్గారావు, జి.శ్రీరామచంద్రమూర్తి, ఎం.పకీరునాయుడు, శ్రీధర్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

గరుగుబిల్లి: దివ్యాంగుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎంఈఓ ఎస్.నాగభూషణరావు అన్నారు. మండల కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం భవిత కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు అన్ని రంగాల్లో తమ ప్రతిభను కనబరిచేందుకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా కొప్పర సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ కవిత 25 మంది దివ్యాంగులకు రగ్గులను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ 2 కె.కొండలరావు, ఐటీఆర్‌టీ వై.వీర్రాజు, ఎంఆర్‌సీ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



దివ్యాంగుల ర్యాలీలో పాల్గొన్న ఎంఈఓ నాగభూషణరావు తదితరులు

ప్రజా సహకారంతోనే శాంతిభద్రతల పరిరక్షణ

పాలకొండ/పాలకొండ రూరల్: ప్రజల సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణ సాధ్యమని సీఐ మీసాల చంద్రమౌళి అన్నారు. విశాఖ సైబర్ క్రైమ్ విభాగం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చిన ఆయన ఉద్యోగ బాధ్యతలు గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో ఇటీవల చోటుచేసుకున్న చోరీ ఘటనపై దృష్టి పెడతామన్నారు. అనంతరం డీఎస్పీ జీవీ కృష్ణారావును మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కోటదుర్గమ్మను దర్శించుకున్నారు. ప్రస్తుతం సీఐగా విధులు నిర్వహించిన ఎస్.మురళీధర్ చిన్నమేరంగికి బదిలీపై వెళ్లారు.

వాటపాగులో వైద్య శిబిరం

పాలకొండ రూరల్: ప్రస్తుత శీతాకాలంలో గ్రామీణ ప్రాంత ప్రజలు తమ ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎం.సింగుపురం పీహెచ్‌సీ వైద్యాధికారి శివశంకర్ అన్నారు. మండలంలోని వాటపాగు గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులు, చిన్నారులు, బాలింతలు, గర్భిణులు శీతాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. చల్లని గాలుల కారణంగా విజృంభించే శ్వాస సంబంధిత సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై వివరించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత వలన కలిగే ప్రయోజనాలు వివరిస్తూ ర్యాలీ చేపట్టారు. సీహెచ్‌ఓ శివ్వాల రమ్య, ఏఎన్‌ఎం పి.రాజేశ్వరి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.



ప్రజలకు ఆరోగ్య సూచనలు చేస్తున్న వైద్యాధికారి శివశంకర్

17న జిల్లా సమగ్ర అభివృద్ధిపై సదస్సు

కురుపాం: పార్వతీపురంలో ఈ నెల 17న జిల్లా సమగ్ర అభివృద్ధిపై సదస్సు నిర్వహించనున్నట్టు సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు తెలిపారు. మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులతో కలసి జిల్లా సమగ్ర అభివృద్ధి సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 17న ఉదయం 10 గంటలకు పార్వతీపురంలోని బెలగాం చర్చి సెంటర్ కమ్యూనిటీ హాల్‌లో సదస్సు జరుగుతుందన్నారు. మన్యం జిల్లాలో గిరిజన ప్రాంతాల అభివృద్ధికి నియోజకవర్గాల వారీగా కార్యాచరణను రూపొందించనున్నట్టు తెలిపారు. సీపీఎం మండల కార్యదర్శి శ్రీనివాసరావు, ఎస్.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న సీపీఎం నేతలు

సేవలకు విఘాతం లేకుండా...

పాలకొండ రూరల్: అంగన్‌వాడీలు తమ సమస్యల పరిష్కారం కోరుతూ నిరసన బాట పట్టడంతో సదరు సేవలకు విఘాతం లేకుండా ఎంపీడీఓ జొంక త్రినాధులు నేతృత్వంలో కేంద్రాలను పలు శాఖలకు చెందిన అధికారులతో నిర్వహింపజేశారు. ముఖ్యంగా ఐసీడీఎస్, వెలుగు, సచివాలయ సిబ్బందితో కేంద్రాలకు వచ్చే పిల్లలకు, వారి తల్లులకు సేవలు అందించారు. మండల పరిధిలో 67 కేంద్రాలుండగా 48 కేంద్రాల ద్వారా సేవలు అందించారు. పలు గ్రామాల్లో సర్పంచులు సహకరించటం విశేషం. ఎంపీడీఓ వెంట ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.మేరమ్మ, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.



సింగన్నవలస కేంద్రంలో పిల్లలకు గుడ్లు, పాలు అందజేస్తున్న ఎంపీడీఓ త్రినాధులు